క్లుప్తంగా

మద్ది అంజన్నకు విశేష పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గుర్వాయిగూడెంలో వేంచేసి యున్న శ్రీ మద్ది ఆంజనేయ స్వామివారిని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అర్చకులు స్వామివారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. వివిధ సేవల రూపేణా స్వామివారికి రూ.1,35,916 ఆదాయం సమకూరినట్లు ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. సుమారు 1,000 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ధర్మకర్తలు కర్పూరం రవి, బల్లే నాగలక్ష్మి, సూపరింటెండెంట్ జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్‌గా పోల్నాటి బాబ్జి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా బాబ్జిని పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. కాగా తనకు జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీకి బాబ్జి కృతజ్ఞతలు తెలిపారు.

బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

పోలవరం రూరల్: బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలని ఎంఈవో ఎల్.చూడామణి సూచించారు. పోలవరం వెలుగు కార్యాలయంలో మంగళవారం వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, వలంటీర్లు, సీఆర్‌పీలతో ఆమె సమావేశం నిర్వహించారు. మండలంలో 5 నుంచి 18 సంవత్సరాలలోపు బడి మానేసిన పిల్లలు ఏ కారణంతో పాఠశాలకు వెళ్లడం మానేశారో తెలుసుకుని తల్లిదండ్రుల సహకారంతో తిరిగి పాఠశాలలో చేరేలా ప్రోత్సహించాలన్నారు. సమావేశానికి ఎంపీడీవో జి.శ్రీను హాజరయ్యారు.

ఆలయాభివృద్ధికి విరాళం

కొయ్యలగూడెం: బయ్యనగూడెంలోని ప్రసిద్ధి శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాభివృద్ధికి దాతలు రూ.లక్ష విరాళాన్ని మంగళవారం అందజేశారు. వేదాంతపురం గ్రామానికి చెందిన లక్కాకుల వెంకటేశ్వరరావు, లక్ష్మి దంపతులు తమ మనవడు ప్రసాద్ జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని ఆలయ ధర్మకర్త బాలం దత్తుడుకు అందజేశారు. విరాళాన్ని అన్నసమారాధన, ఆలయాభివృద్ధికి వినియోగించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, ఉప సర్పంచ్ కోరుకొండ లలిత, మాజీ సర్పంచ్ బాలం నాగదుర్గ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల యూనియన్ మండల కమిటీ ఎన్నిక

కుక్కునూరు: కుక్కునూరు వీఆర్‌ఏల యూనియన్ మండల కమిటీ అధ్యక్షునిగా పోచారపు వెంకన్నబాబు, కార్యదర్శిగా మోతుకూరి వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ తెలిపారు. మంగళవారం కుక్కునూరు ప్రజా సంఘాల కార్యాలయంలో రెవెన్యూ సహాయకుల సంఘం మండల కమిటీ సమావేశం వెంకన్నబాబు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వెంకన్నబాబు, వెంకటేశ్వర్లును రెండోసారి మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎనుకున్నట్టు చెప్పారు.

మహిళ ఆత్మహత్య

చింతలపూడి: పట్టణంలోని మెరక వీధిలో ప్రియాంక కుమారి(31) అనే మహిళ మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భర్త పంకజ్ కుమార్ కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం పనిమీద గోపాలపురం వెళ్లాడు. అయితే తన ఆరోగ్యం బాగాలేదని ప్రియాంక భర్తకు తెలిపింది. పని ఉండంతో పంకజ్ కుమార్ గోపాలపురం వెళ్లిపోయాడు. ఈ క్రమంలో భార్య ఎన్నిసార్లు ఫోన్ చేసినా భర్త ఫోన్ ఎత్తకపోవడంతో మనస్థాపం చెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. ఎస్సై కె.ప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

ఆవుల అపహరణపై కేసు

జంగారెడ్డిగూడెం: ఆవుల అపహరణపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావు తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన ముప్పిడి దుర్గయ్య 10 ఆవులను మేపుకుంటూ జీవిస్తున్నాడు. ఈనెల 10వ తేదీ రాత్రి 4 ఆవులను, 12వ తేదీ రాత్రి 5 ఆవులను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనకు కొలూరి రామారావు అనే వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు పోలీసులకు తెలిపాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

మహిళ అనుమానాస్పద మృతి

చింతలపూడి: స్థానిక ఎన్‌వీఎస్ కాలనీకి చెందిన చేతుకూరి బేబి (32) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈమెకు భర్త లేడు. ఆశా వర్కర్‌గా పనిచేస్తోంది. ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఉదయం పని మీద వెళుతున్నట్లు కుటుంబ సభ్యులకు తెలిపింది. ఆ తర్వాత ఫోన్ ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి తలుపు బద్దలు కొట్టి చూడగా, బేబి అచేతనంగా పడి ఉండటాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై కె.ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- బూరుగువాడలో గడప గడపకు మన ప్రభుత్వం



బూరుగువాడలో గ్రామస్తులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనతో ప్రజలు ఆనందంగా ఉన్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామాలైన బూరుగువాడ, ఏపులపాటు గ్రామాల్లో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం గత నాలుగేళ్లగా అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ప్రతి గడపకూ వెళ్తున్నామని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి కూడా చిత్తశుద్ధితో పని చేస్తామని తెలిపారు. సీఎం జగన్ పాలనలో మారుమూల అటవీ ప్రాంతంలోని గ్రామాల గిరిజనులకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని అన్నారు. ప్రతి గ్రామంలోని లబ్ధిదారులకు రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్‌లు జోడే సత్య దుర్గాప్రసాద్, కోర్సా గంగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, సయ్యద్ బాజీ, కారం వెంకట రమణ, మడివి దుర్గారావు, వెట్టి దశరథుడు, వెట్టి పెంటమ్మ, కుర్సం వెంకట స్వామి, మడివి బొజ్జి, న్యూడెమోక్రసీ నాయకులు కారం రాఘవ, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

జంగారెడ్డిగూడెం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని బుట్టాయగూడెం గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ పి.మణేంద్రరావు అన్నారు. మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్ బాబు అధ్యక్షతన ఇంటర్ కాలేజీయేట్ టోర్నీ నిర్వహించారు. విద్యార్థులకు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ విద్యార్థినులకు కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మణేంద్రరావు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం

జంగారెడ్డిగూడెం రూరల్ : జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం వాటర్ స్పోర్ట్స్ సెంటర్‌లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల విజయవాడలో జరిగిన కనోయింగ్, కయాకింగ్ పోటీల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించిన జల క్రీడాకారులను అభినందించారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ జూనియర్ కళాశాల రిటైర్డ్ పీడీ నరసింహరావు పాల్గొన్నారు.

విర్డ్స్‌లో మరిన్ని సేవలు ప్రారంభం

- ఇకపై ప్రతి మంగళ, గురువారాల్లో చెవి, ముక్కు, గొంతు వ్యాధులకు చికిత్స
- ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు వెల్లడి



ఆస్పత్రిలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ క్రిషన్‌బాబా

ద్వారకాతిరుమల: సేవే లక్ష్యంగా శ్రీ వేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ రిహ్యాబిలిటేషన్ ఫర్ ది డిజేబుల్డ్ (విర్డ్స్) ఆస్పత్రిలో రోగులకు నామమాత్రపు రుసుంతో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని శ్రీవారి దేవస్థానం, విర్డ్స్ ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు అన్నారు. స్థానిక విర్డ్స్ ఆస్పత్రిలో చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధులకు చికిత్సలను ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ వీవీ క్రిషన్‌బాబా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు రోగులకు ఆధునాతన పరికరాలతో వైద్యసేవలను అందించారు. ప్రతి మంగళ, గురువారాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విర్డ్స్‌లో ఈ సేవలను అందిస్తామని చైర్మన్ సుధాకరరావు తెలిపారు. బయట ఆస్పత్రులతో పోలిస్తే తమ ఆస్పత్రిలో 50 శాతం కంటే తక్కువ రుసుంకు వైద్య సేవలను అందిస్తున్నట్టు చెప్పారు. అలాగే ఓపీ ఫ్రీగా నిర్వహిస్తున్నామన్నారు. గతంలో ఆర్థోపెడిక్‌కు మాత్రమే పరిమితమైన ఈ ఆస్పత్రిలో ఇకపై చెవిలో చీముకు, చెముడుకు ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీ, టాన్సిల్స్, ఎడినాయిడ్స్ సర్జరీలను వైద్యుడు క్రిషన్‌బాబా నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో విర్డ్స్ ట్రస్ట్ వైస్ చైర్మన్ ఆనందరాజు, సభ్యులు వెంపరాల నారాయణమూర్తి, ఐవీఆర్ సుధాకరరావు, ఎం.గుప్తా, చెలికాని రాజాబాబు, వంశీ, వైద్యులు డాక్టర్ భవ్య చంద్, హమీద్, నాగేంద్ర, బాలాజీ, విహారి, గాయత్రి, సింధు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం కృషి

చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా



చింతలపూడిలో డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి: రాష్ట్రంలోని పేద మహిళల సామాజిక ఆర్థికాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. స్థానిక ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం చెక్కులను మంగళవారం డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూటికి నూరుశాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల కోసం పెద్దెత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, అమ్మఒడి వంటి పథకాలు ప్రవేశపెట్టి మహిళల పక్షపాతిగా ముద్ర వేసుకున్నారని కొనియాడారు. గతంలో చంద్రబాబు నాయుడు 600 హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ముఖ్యంగా డ్వాక్రా మహిళల రుణాలు మంజూరు చేస్తామని చెప్పి మోసం చేశారని విమర్శించారు. నియోజకవర్గంలో సున్నా వడ్డీ పథకం కింద రూ.10.78 కోట్లు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి జ్ఞానారెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గంధం చంటి, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు ఎస్.వరలక్ష్మి, సర్పంచ్‌లు యడ్లమోహన్, వెంకట్రావు, తాండ్ర రామకృష్ణారావు, పట్టణ సచివాలయాల కన్వీనర్ ఎం.దుర్గారావు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ డైరెక్టర్ పందు జగదీష్, లింగపాలెం, కామవరపుకోట మండలాల కన్వీనర్‌లు ముసునూరు వెంకటేశ్వరరావు, మిడతా రమేష్, ఏఎంసీ డైరెక్టర్‌లు ఎం.ఇమ్మానియేలు, బోడా బాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్.కాంతారావు, మండల విద్యార్థి విభాగం కన్వీనర్ మిరియాల దిలీప్, ఎంపీడీవో మురళీకృష్ణ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులు ఉద్యమాలకు సిద్ధం కావాలి



సమావేశానికి హాజరైన నాయకులు

జంగారెడ్డిగూడెం: మున్సిపల్ కార్మికుల హక్కుల పరిరక్షణ కోరుతూ ఈనెల 30, 31 తేదీల్లో ఏలూరులో జరిగే ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని జంగారెడ్డిగూడెం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జేవీ రమణరాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో యూనియన్ సమావేశం అధ్యక్షుడు కొత్తూరు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. రమణరాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు తమ హక్కులను కాపాడుకునేందుకు ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచే వసంతరావు, జంగారెడ్డిగూడెం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కూనపాముల విగ్నేష్, కమిటీ సభ్యులు కొత్తూరు శ్రీను, ముప్పిడి శ్రీను, చాపల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

టి.నరసాపురం: టి.నరసాపురం 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి తిరుమలదేవి పేటకు కొత్త లైన్ల అనుసంధాన ప్రక్రియ కొనసాగుతోందని, ఈ క్రమంలో బుధవారం తిరుమలదేవి పేట సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని జంగారెడ్డిగూడెం విద్యుత్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రైస్‌మిల్లుల కేటాయింపు కోరుతూ కలెక్టర్‌కు వినతి

పోలవరం రూరల్: మండలంలోని రైతులు ధాన్యం అమ్ముకునేందుకు వీలుగా సమీపంలోని రైస్‌మిల్లులను కేటాయించాలని గూటాల సొసైటీ అధ్యక్షుడు సుంకర అంజిబాబు, పోలవరం సొసైటీ అధ్యక్షుడు బంగారు అప్పారావు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు వినతి పత్రం సమర్పించారు. ఏలూరులో మంగళవారం కలెక్టర్‌ను కలిసి రైతుల అవస్థలను వివరించారు. పోలవరం మండలంలో రైస్‌మిల్లులు లేని కారణంగా ధాన్యాన్ని 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న జంగారెడ్డిగూడెం తరలించాల్సి వస్తోందని, దీంతో రైతులు రోజుల తరబడి మిల్లర్ల వద్ద ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని కలెక్టర్‌కు వివరించారు. పోలవరానికి దగ్గరలో ఉన్న తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి గ్రామంలోని రైస్ మిల్లులకు టాగ్ చేసి రైతుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తిచేశారు.

సమరభేరి వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం శ్రేణులు

కొయ్యలగూడెం: ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం చేపట్టిన సమరభేరి వాల్ పోస్టర్‌ను స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు, నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం అఖిల భారత కమిటీ ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చిందన్నారు. 2014 ముందు గ్యాస్ ధర రూ. 450 ఉండేదని, బ్యాంకు ఖాతాలో సబ్సిడీ కూడా జమ అయ్యేదని, మోడీ అధికారంలోకి వచ్చాక గ్యాస్ ధర రూ.1,200లకు, పెట్రోల్ లీటర్ రూ.70 నుంచి రూ.111.2లకు, డీజిల్ రూ.100లకు పెరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.శివకుమార్, జి.గోపి, మర్రి త్రిమూర్తులు, ఎస్‌కే జహంగీర్, వి.దుర్గాప్రసాద్, వి.సురేష్, రాచూరి దుర్గారావు, రాచూరి నాగేశ్వరరావు, ఏలేటి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సయ్యద్ బాజీకి సన్మానం

బుట్టాయగూడెం: వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సయ్యద్ బాజీని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మంగళవారం సాయంత్రం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పిస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఉంటూ పార్టీ గెలుపునకు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, ఎంపీపీ కారం శాంతి, కారం వెంకటరమణ, సర్పంచ్‌లు జోడే సత్య దుర్గాప్రసాద్, కుంజా వెంకటేశ్వరరావు, యాండ్ర రవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి పవిత్రోత్సవాలు ప్రారంభం

ద్వారకాతిరుమల: చిన వెంకన్న క్షేత్రంలో శ్రీవారి దివ్య పవిత్రోత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా ఆలయ యాగశాలలో అర్చకులు విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, అఖండదీపారాధన, వాస్తుపూజ, మృత్సంగ్రహణ, అలాగే వాస్తు హోమం, పవిత్ర శుద్ధి జరిపారు. అనంతరం అంకురార్పణ నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అంతకు ముందు అర్చకులు, పండితులు పుట్టమన్నును తెచ్చి సిద్ధంగా ఉంచిన పాలికల్లో పోశారు. ఆ తరువాత మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ నవధాన్యాలను పాలికల్లో ఉంచారు. దాంతో అంకురార్పణ కార్యక్రమం ముగిసింది. ఆలయంలో ఏడాది పొడవున తెలిసీ, తెలియక జరిగిన తప్పుల ప్రాయఃశ్చిత్తం నిమిత్తం ఈ పవిత్రోత్సవాలను జరపడం సంప్రదాయంగా వస్తోంది. ఉత్సవాల్లో భాగంగా బుధవారం పవిత్రాదివాసాన్ని నిర్వహించనున్నట్టు అర్చకులు తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు పర్యవేక్షించారు.

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు సహకరించాలి

చింతలపూడి: స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద డస్ట్‌బిన్‌లను పంచాయతీ కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛాంధ్రప్రదేశ్ దిశగా రాష్ట్రం అడుగులు వేస్తోందని, ప్రతి ఒక్కరూ చెత్తా చెదారం రోడ్లపై వేయకుండా డస్ట్‌బిన్‌లలో వేయాలన్నారు. రోడ్డుపై చెత్తవేస్తే కఠిన చర్యలతో పాటు జరిమానా కూడా విధిస్తామని తెలిపారు. సీతానగరం గొద్రేజ్ ఆగ్రోవెట్ ఆయిల్ పామ్ కంపెనీ అందజేసిన డస్ట్‌బిన్‌లను పట్టణంలో వ్యాపారుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ ఎస్.రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్యశిబిరం

చింతలపూడి: మండలంలోని సీతానగరంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్యశిబిరం గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సొగత నియోగి ప్రారంభించారు. సేవా స్వచ్ఛంద సంస్థ ఏలూరు ఆధ్వర్యాన జరిగిన ఈ శిబిరంలో పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లకు వైద్యాన్ని అందించి మందుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జి.మల్లేశ్వరి, ఎంపీటీసీ సభ్యుడు కె.రామారావు, సేవా సంస్థ కార్యదర్శి యు.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

పట్టిసీమ కాలువ నీటితో చెరువులను నింపాలి

ద్వారకాతిరుమల: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో చెరువులను పట్టిసీమ కాలువ నీటితో నింపాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యాన మండలంలోని ఎం.నాగులపల్లి సచివాలయం వద్ద రైతులు మంగళవారం ధర్నా చేపట్టారు. నీటితో చెరువులను నింపి సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ పి.సతీష్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో వర్షాలు కురవకపోవడం వల్ల కరువు పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, మండల అధ్యక్షుడు బోయపాటి సత్యన్నారాయణ, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

తేనెలొలికే తియ్యని భాష తెలుగు



కామవరపుకోట : గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



జంగారెడ్డిగూడెం : గుంటూరు భాష్యం స్కూల్‌లో సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు

ద్వారకాతిరుమల: తేనెలొలికే తియ్యని భాష తెలుగు అని పంగిడిగూడెం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.సురేష్ అన్నారు. హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు హెచ్‌ఎం పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులతో డ్రాయింగ్ టీచర్ సుబ్బారావు తెలుగు కవుల చిత్రాలను గీయించారు. అనంతరం వ్యాసరచన, పద్యపఠనం, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో తెలుగు పండితుడు రమేష్, శారద, బీబీ, కుమారస్వామి, ప్రభాకరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తికి నివాళి

కామవరపుకోట: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యాన గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి సేవలను కొనియాడారు. తెలుగు అధ్యాపకుడు డాక్టర్ జి.శ్రీనివాసరావు తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి.రామ్మోహన్, ధారావతు మల్లేష్, వి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం: తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమకారుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహించారు. లైబ్రేరియన్ యు.రాముడు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జూనియర్ కళాశాల, హైస్కూల్ విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. కొయ్యలగూడెం ప్రకాశం డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి బోడిగూడెం జెడ్పీ హైస్కూల్ నుంచి డాక్టర్ వరప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కళాశాల చైర్‌పర్సన్, కరస్పాండెంట్ జనార్దన్, డైరెక్టర్ పార్థసారధి ఆధ్వర్యాన వరప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష గణనీయమైనదని పేర్కొన్నారు. శ్రీశ్రీ కళా వేదికలో కవితలు వినిపించిన వారిని సన్మానించి సర్టిఫికెట్, షీల్డ్ ప్రదానం చేశారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విద్యావికాస్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. డైరెక్టర్ పి.సతీష్‌చంద్, కరస్పాండెంట్ వి.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, డైరెక్టర్ లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గుంటూరు భాష్యం స్కూల్‌లో చైర్మన్ భాష్యం రామకృష్ణ విద్యార్థులు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ సూర్యనారాయణ తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరించారు. విద్యార్థులకు పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. థామ్స్ ప్రిన్సిపాల్ పి.రాధికారాణి, అధ్యాపక బృందం పాల్గొన్నారు. ప్రతిభ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరోజారెడ్డి మాట్లాడుతూ తెలుగు సాహిత్యం అందరికీ అందుబాటులోకి రావాలంటే మాట్లాడుకునే భాషలోనే రచనలు సాగించాలని రామ్మూర్తి బలంగా నమ్మి ఆచరించారన్నారు. డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, తెలుగు ఉపాధ్యాయులు వెంకట్రావు, పూర్ణిమ, ధనలక్ష్మి, ఉష, నజీరున్నీసా పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన నలుగురు తెలుగు భాషా పండితులను సన్మానించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు ఎస్.శ్రీనివాస్, జెడ్పీ స్కూల్ తెలుగు అధ్యాపకులు ఎం.నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు తెలుగు భాష ఆవశ్యకతను వివరించారు. తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ జి.వెంకటలాల్, బుట్టాయిగూడెం గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.మణిందర్ పాల్గొనగా విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.

రామ్మూర్తి సేవలు మరువలేనివి

లింగపాలెం: తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి సేవలు మరువలేనివని ప్రధానోపాధ్యాయుడు బీవీఎస్ఎస్ రాజు అన్నారు. ధర్మాజీగూడెం జెడ్పీ హైస్కూల్, శ్రీవిద్యా హైస్కూల్‌లో రామ్మూర్తి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయులు ఎల్.ప్రకాశరావు, వడ్లాని సునీత, జి.సుధారాణి, శ్రీవిద్యా స్కూల్ డైరెక్టర్ సీహెచ్ రత్నకరావు పాల్గొన్నారు.